క్లుప్తంగా

ద్రాక్షారామలో సినీ సందడి



చిత్రమహల్ టాకీస్‌గా పేరు మార్చిన శివరంజని థియేటర్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో సినిమా షూటింగ్‌తో సందడి నెలకొంది. గ్రామంలోని శివరంజని థియేటర్ కేంద్రంగా షూటింగ్ నిర్వహిస్తున్నారు. సినీనటుడు సుధీర్‌బాబు హీరోగా నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దీనికోసం శివరంజని థియేటర్‌ను చిత్రమహల్ టాకీస్‌గా పేరు మార్చి షూటింగ్ చేస్తున్నారు.

చురుగ్గా డ్రైన్ నిర్మాణ పనులు



ద్రాక్షారామ ముస్లిం కాలనీలో డ్రైన్ నిర్మాణ పనులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ ముస్లిం కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో చేపట్టిన డ్రైన్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దశాబ్దాలుగా తీరని కలగా ఉన్న డ్రైన్ల నిర్మాణం వడివడిగా జరుగుతుండటంతో ముస్లిం కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా పరిశీలించారు.

నిత్యావసరాల పంపిణీ

కాజులూరు: మండలంలో పలు కుటుంబాలకు జనసేన నాయకులు సాయం అందజేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉప్పుమిల్లి ఎంపీటీసీ కొప్పిశెట్టి కృష్ణమూర్తి, పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ ట్రస్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ పోలిశెట్టి శ్రీనివాస్ తదితరులు శుక్రవారం ఈ సాయం అందించారు. నామవానిపాలెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జర్నలిస్టు మాత గౌతమ్‌రాజు, తిప్పరాజుపాలెం శివారు పెద్దపోలంకు చెందిన పోలినాటి నాగు, శలపాకకు చెందిన పులగల గోవిందమ్మ కుటుంబీకులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు.

స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తితో మెలగాలి



మండపేటలో అమృత్ కలశయాత్ర నిర్వహిస్తున్న నాయకులు, అధికారులు, విద్యార్థులు

మండపేట: ప్రతి ఒక్కరూ స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తితో మెలుగుతూ దేశ పురోభివృద్ధికి బాటలు వేయాలని వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం ఎంపీడీఓ ఐ. రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమృత్ కళశ యాత్రను ఆయన ప్రారంభించారు. మండలంలోని వివిధ పంచాయతీల నుంచి తీసుకు వచ్చిన మట్టి కలశాలతో స్థానిక రాజారత్న రోడ్డు నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రాజు అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైస్ ఎంపీపీ నాగబాబు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. ఎంపీడీఓ రాజు మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను మరువలేనివన్నారు. వారిని స్మరించుకుంటూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. ఈ మట్టి కలశాలను అమరావతి పంపనున్నట్టు తెలిపారు. అక్కడి నుంచి ఇవి ఢిల్లీకి చేరుకుంటాయన్నారు. ద్వారపూడి సర్పంచ్ ఈతకోట కిన్నెర, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పిల్లా అరవరాజు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ సుభానీ, ఎంఈఓ సీహెచ్‌వీ సోమిరెడ్డి, వివిధ పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయవరంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాయవరం: స్థానిక సత్యసాయి సేవాసమితి పర్యవేక్షణలో రాయవరంలో శుక్రవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కడియం మండలం వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నేత్ర వైద్య శిబిరంలో 80 మంది వైద్య సేవలు పొందారు. వైద్య శిబిరంలో డాక్టర్ కరీమ్, సిబ్బంది ఎం.చంటిబాబు, కె.సుబ్బారావు, సీహెచ్ ప్రవీణ్ సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 11 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించి, వేమగిరి ఆస్పత్రికి తరలించారు. వైద్య శిబిరంలో జిల్లా బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ జి.కాశీ విశ్వనాథం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మెడికల్ ఇన్‌చార్జ్ అజ్జవరపు సూర్యనారాయణమూర్తి, సేవాదళ్ సభ్యులు కర్రి శ్రీనివాసరావు, ఎస్.వెంకన్న, ఎస్.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



వెల్లలో సామూహిక లక్ష కుంకుమార్చనలో మహిళలు



మొగలిపాలెం దుర్గాదేవి ఆలయంలో సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు



రామచంద్రపురం శివాలయం వీధిలో కనకదుర్గమ్మ ఆలయంలో మహిళల పూజలు



రాయవరం దుర్గాదేవి ఆలయం వద్ద సరస్వతీ పూజల్లో చిన్నారులు



సోమేశ్వరం శివాలయంలో సరస్వతీ పూజలు చేస్తున్న చిన్నారులు

చదువుల తల్లీ... ప్రణమిల్లి

- సరస్వతీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ
- ఘనంగా దేవీ నవరాత్ర మహోత్సవాలు

రామచంద్రపురం: దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా దుర్గమ్మ వారు శుక్రవారం సరస్వతీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని కొత్తూరు రోడ్డు జోడు తూముల వద్ద వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ఆరో రోజు అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయం వీధిలో కనకదుర్గమ్మను చదువుల తల్లిగా అలంకరించి విద్యార్థులతో సరస్వతీ పూజ చేయించారు. ఆలయంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. స్థానిక శాంతినగర్, శీలంవారిసావరం, ప్రధాన రహదారిలోని దేవీ ఆలయాల్లో ఉదయం నుంచి భక్తుల రద్దీ నెలకొంది.

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు దేవాలయాల్లో శరన్నవరాత్ర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన, సువర్ణ పుష్పార్చన చేశారు. మాణిక్యాంబ అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సామూహిక సరస్వతీ పూజల్లో సుమారు 3 వేల మంది చిన్నారులు పాల్గొన్నారు. ద్రాక్షారామ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వారణాసి కార్తికేయ బ్రహ్మత్వంలో సరస్వతీ దేవి అవతారంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారిని అలరించారు. ఆదివారపుపేట శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో పార్వతీ అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకుడు బోండు బాల బ్రహ్మత్వంలో పూజాదికాలు నిర్వహించారు.

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో దసరా మహోత్సవాలను పురస్కరించుకుని సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజ చేశారు. గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ మేడిశెట్టి వీరవెంకట సత్యనారాయణ పర్యవేక్షించారు.



ద్రాక్షారామ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



కొత్తూరు రోడ్డులో కనకదుర్గమ్మ వారు

వైభవంగా సరస్వతీ పూజలు

కాజులూరు: దేవీ నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని దుర్గాదేవి ఆలయాల్లో సరస్వతీ పూజలు ఘనంగా జరిగాయి. మూలా నక్షత్రం కావటంతో అమ్మవారిని సరస్వతీ దేవిగా అలంకరించి చిన్నారులచే పూజలు చేయించారు. కాజులూరు, ఆర్యావటం, మొగలిపాలెం, శీల, గొల్లపాలెం, కుయ్యేరు, కోలంక తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విద్యార్థులచే తల్లిదండ్రులు సరస్వతీ పూజలు చేయించారు. మొగలిపాలెం కనకదుర్గాదేవి ఆలయంలో సుమారు 200 మంది చిన్నారులకు స్థానిక భవానీ భక్తులు పెన్నులు, పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు.

వాడవాడలా సరస్వతీ పూజలు..

రాయవరం: స్థానిక పార్వతీ సమేత రాజేశ్వరస్వామి, చెల్లూరులోని అగస్త్యేశ్వరస్వామి, సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి, వెంటూరులోని ఉమా సమేత సోమేశ్వరస్వామి, పసలపూడి శివాలయంలో శుక్రవారం నిర్వహించిన సరస్వతీ పూజల్లో అధిక సంఖ్యలో చిన్నారులు పాల్గొని పూజలు చేశారు.



ఆలయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

వీరబ్రహ్మేంద్రస్వామి గుడిలో సరస్వతీ పూజలు

రాయవరం: మండలంలోని సోమేశ్వరం గ్రామ శివారు రెడ్డికృష్ణమ్మపేటలో వేంచేసియున్న గోవిందాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం సరస్వతీ పూజలు నిర్వహించారు. సుమారు 400 మంది విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ విద్యార్థులు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు, స్కెచ్ పెన్నులు, పుస్తకాలు, జామెట్రీ బాక్సులు అందదజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సమావేశం ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష కుంకుమార్చన

మండపేట: పట్టణంలోని ఏడిద రోడ్డులోని పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ఆలయ కమిటీ చైర్మన్ వాలిన వీరబాబు ఆధ్వర్యంలో శరన్నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన లక్ష కుంకుమార్చనలో మండపేట, ఏడిద, తాపేశ్వరం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు మేడిశెట్టి సూర్యభాస్కర రావు, మండిపూడి చంద్రశేఖర్, కేతిన శ్రీనివాస్, అద్దాల సత్తిబాబు, మహేష్, వెంకట్, శివరాం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

తాతపూడిలో చండీయాగం

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి పుణ్య గౌతమి గోదావరి తీరాన ఉన్న శ్రీవిజయదుర్గ అమ్మవారి ఆలయంలో శెట్టిబలిజ సంఘం, తాతపూడి గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో చండీయాగ పూజలు చేశారు. మాగాపు వీరభద్రశర్మ బ్రహ్మత్వంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. గ్రామానికి చెందిన పుణ్య దంపతులు పీటలపై కూర్చుని యాగ పూజలు చేశారు. గ్రామంతో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమాన్ని సంఘం పెద్దలు జిత్తుక శ్రీను, పలివెల దొరబాబు, బొక్కా లోవరాజు, కొప్పిశెట్టి శ్రీనివాస్, జగ్గంశెట్టి బాపిరాజు, సూరంపూడి వెంకటరమణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.



మండపేటలో పెద్దమ్మ తల్లికి పూజలు చేస్తున్న భక్తులు



తాతపూడి గోదావరి తీరాన చండీయాగ పూజలు చేస్తున్న భక్తులు

పేదల ఆరోగ్యానికి మరింత భరోసా

- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

కె.గంగవరం: పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. మండలంలోని బాలాంత్రం సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి వేణు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచిందన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందిస్తుందన్నారు. శిబిరం వద్దే 14 రకాల వైద్య పరీక్షలు చేయడంతో పాటు రక్త పరీక్షలు చేసి రోగాన్ని నిర్ధారించి ఉచితంగా నాణ్యమైన మందులు అందిస్తున్నారని చెప్పారు. ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, సర్పంచ్ తోలేటి కృష్ణమూర్తి, ఎంపీటీసీ కోట బుల్లి సత్యనారాయణ (సత్తిబాబు), ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ చాగంటి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



బాలాంత్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

కాలేరులో 535 మందికి వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం: మండలంలోని కాలేరు గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలకు సంబంధించి 535 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. అచ్యుతాపురం పీహెచ్‌సీ వైద్యులు గవర శ్రీదుర్గ, కరుణేంద్రకుమారి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీటీసీ సభ్యుడు టి.సత్యమంజు, సర్పంచ్ దాయం కావేరి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఏలేటి గంగరాజు శిబిరంలో సేవలను పర్యవేక్షించారు. గ్రామంలో 3,394 మంది జనాభా ఉండగా వారిలో 3,232 మందిని ఆరోగ్య సర్వే చేశారు. ఆరోగ్య సమస్యలున్న 300 మందికి టోకెన్లు ఇచ్చి సురక్ష శిబిరానికి సిఫార్సు చేశారు. వారితో పాటు మరికొంత మంది శిబిరంలో వైద్య సేవలను పొందారు. 12 మందికి క్షౌ పరీక్ష చేశారు. దంత పరీక్షలు 90 మందికి, చిన్నారుల సమస్యలపై నలుగురు, గర్భకోశ 01, జనరల్ సర్జరీ 15, కంటి 125, ఎముక 75, ఇఎన్‌టి 14, బీపీ, షుగరు వంటి జనరల్ మెడిసిన్ 363, ఇతరల ఆరోగ్య సమస్యలకు సంబంధించి 30 మందిని పరీక్షించారు. ముగ్గురుని మెరుగైన పరీక్షలు చేయించాలని నిర్ణయించారు. శిబిరంలో పలు ఆసుపత్రుల్లో నిపుణులైన వైద్యులు సేవలందించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. శిబిరాన్ని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ పలివెల మధు సందర్శించారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు.



కాలేరులో గర్భిణులకు సీమంతం చేస్తున్న ప్రజాప్రతినిధులు

చెల్లూరులో 548 మందికి..

రాయవరం: రాష్ట్ర ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకునివచ్చారని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ పేర్కొన్నారు. మండలంలోని చెల్లూరు సచివాలయం-3 వద్ద సర్పంచ్ పాలిక రాఘవ ఆధ్వర్యంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు ఈ శిబిరంలో 548 మందికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీటీసీ వైట్ల వీరవేణి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ చిక్కాల శ్రీరాములు, వైఎస్సార్‌సీపీ నేతలు పాలిక గోవిందు, నల్లమిల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను తక్షణమే పరిష్కరించండి

జేసీ నుపూర్ అజయ్



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్

కె.గంగవరం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ విజయ్ అధికారులకు సూచించారు. కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. దీనిని గ్రామీణ ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వ్యాప్తంగా 43 అర్జీలు అందాయని, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు సూచించామన్నారు. సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌరసరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల మంజూరు, పింఛన్లు, భూ సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాల తదితర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయన్నారు. అర్జీదారుల్లో విశ్వసనీయత పెంపొందించడానికి నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఆర్డీఓ సింధూ, సీపీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఏఈ చంటిబాబు, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, డీపీఓ వి.కృష్ణకుమారి, డ్వామా పీడీ మధుసూదన్, వ్యవసాయశాఖ అధికారి బోసు, నోడల్ అధికారి కె.భీమేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

అంబాజీపేట: పుల్లేటికుర్రు శివారు చినలంక వద్ద 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అంబాజీపేట పోలీసుల కథనం ప్రకారం.. చినలంకకు చెందిన పెట్టా విజయ్‌కుమార్ కొత్తపేట నుంచి తన స్నేహితుడి మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తున్నాడు. ప్రధాన రహదారి క్రాస్ చేస్తున్న సమయంలో ముక్కామల నుంచి కొత్తపేట వైపు వెళుతున్న మోటారు సైకిలిస్టు విజయ్‌కుమార్‌ను బలంగా ఢీకొట్టాడు. దాంతో విజయ్ కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో అమలాపురం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పి.భగవన్నారాయణ తెలిపారు.

స్వచ్ఛ గ్రామాలను ఆవిష్కరిద్దాం..



రామచంద్రపురం మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

- అంతా సమన్వయంతో సాగుదాం
- మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: స్వచ్ఛ గ్రామాల ఆవిష్కరణకు అంతా సమన్వయంతో పనిచేద్దామని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సూచించారు. రామచంద్రపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా మంత్రి వేణు హాజరై మాట్లాడుతూ పట్టణాన్ని స్వచ్ఛత వైపు నడిపించడంలో గుడ్ మార్నింగ్ రామచంద్రపురం కార్యక్రమం దోహదపడిందన్నారు. అదే తరహాలో గ్రామాల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధులు పారిశుధ్య కార్మికుల సహకారంతో తమ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, మొక్కలు నాటడం, రోడ్లు, డ్రైన్ల నిర్మాణం ద్వారా ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. అనంతరం వివిధ శాఖల సమీక్ష నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, వైస్ ఎంపీపీలు శాకా బాబీ, నరాల రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ ఎస్.కీర్తి స్పందన, తహసీల్దార్ మైలా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

రామచంద్రపురం: స్థానిక వార్డుల్లో సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డుల్లో మంత్రి వేణు గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. చప్పిడివారిసావరం, ముచ్చుమిల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చప్పిడివారిసావరంలో ఓపెన్ ఆడిటోరియం వద్ద సమస్యలను స్థానికులు మంత్రికి తెలిపారు. వాటిని వెంటనే పరిష్కరించాలని కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డిని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కౌన్సిలర్లు కేతా శ్రీను, కోఆప్షన్ సభ్యులు మస్తాన్, గుబ్బల గణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, నాయకులు పెంటపాటి శ్రీను, కంచుమర్తి బాబూరావు, దిగుమర్తి వీరబాబు, కోటి దుర్గారావు, కేతా శ్రీనివాసరావు, కొండేపూడి సురేష్, కుడిపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వివక్ష లేకుండా అర్హులందరికీ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కేశవరంలో గడప గడపకూ..

మండపేట: రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హత కలిగిన ప్రతి పేదవారికి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ పెదపాటి సత్యనారాయణమూర్తి తదితరులతో కలిసి శుక్రవారం ఆయన మండలంలోని కేశవరం ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల పాలనలో ఆయా కుటుంబాల వారికి ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు చెప్పిన సమస్యలపై ఎంపీడీఓ ఐ. రాజు, పంచాయతీ కార్యదర్శి సుబ్బారావులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం అయ్యేందుకు చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. వ్యక్తిగత సమస్యలతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజా అవసరాలను గుర్తించి, పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తున్న నిధులతో స్థానిక అవసరాల మేరకు రోడ్లు, డ్రైన్లు, విద్యుత్తు తదితర అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎంపీటీసీ సభ్యులు అన్నందేవుల కృష్ణారావు, చంద్రమళ్ల పోతురాజు, సొసైటీ చైర్మన్ ముక్కపాటి శ్రీనివాస్, పెదపాటి ఉమామహేశ్వరరావు, వార్డు సభ్యులు అల్లంపల్లి కిషోర్, గోవిందు, జేసీఎస్ కన్వీనర్ బందెల సాయిరాం, పార్టీ నాయకులు తుపాకుల ప్రసన్నకుమార్, సలాది శివ, అబ్బిరెడ్డి వీర్రాజు, వుండమట్ల నారాయణ, యడ్ల రవి, చంద్రమళ్ల యేసయ్య తదితరులు పాల్గొన్నారు.



కేశవరం వాసులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు